క్లుప్తంగా

బీఎన్ఆర్ నగర్‌లో ఎంవీవీ సహపంక్తి భోజనం



బీఎన్ఆర్ నగర్‌లో సహపంక్తి భోజనం చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు తోటగరువు దరి బీఎన్ఆర్ నగర్‌లో మంగళవారం విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ పర్యటించారు. కాలనీలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో పద్మ, దుర్గారావు నివాసంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలిసి ఎంపీ ఎంవీవీ సహపంక్తి భోజనం చేశారు.

యూజీడీ తెరిచి వదిలేశారు..!



రోడ్డు మధ్యలో తెరిచి వదిలేసిన యూజీడీ

ఎంవీపీ కాలనీ: స్థానిక ఉషోదయ కూడలి నుంచి టీటీడీ కూడలికి వెళ్లే మార్గంలో యూజీడీ డ్రైన్ మరమ్మతుల కోసం తవ్వి వదిలేశారు. నెల రోజులు పైగానే అవుతున్నా పనులు మాత్రం పూర్తి చేయలేదు. దీంతో స్థానికులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్గంధం భరించలేక పోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి యూజీడీ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

సంగీత సమితి ప్రారంభం



సంగీత సంస్థను ప్రారంభిస్తున్న ప్రసాద్

సీతంపేట: ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి పేరిట నూతన సంగీత సంస్థ శంకరమఠంలో ప్రముఖుల సమక్షంలో ఘనంగా ప్రారంభమైంది. కళాభారతి కార్యదర్శి డాక్టర్ జి.ఆర్.కె.ప్రసాద్ జ్యోతిని వెలిగించి నూతన సంగీత సంస్థను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో సంగీత జనకులం స్థాపించి తద్వారా శాస్త్రీయ సంగీత వైభవానికి స్వర్గీయ ఐవీఎల్ శాస్త్రి చేసిన మహోన్నత సేవలను కొనియాడారు. శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ టి.రవిరాజు మాట్లాడుతూ సంగీత జనకులం అనే సంగీత పాఠశాలనుస్థాపించి వందలాది మందికి శాస్త్రీయ సంగీతంపై చక్కని అవగాహన కల్పించిన ఘనత ఐవీఎల్ శాస్త్రికే దక్కుతుందన్నారు. సంగీత కళాకారులు పి.గోపాలరావు, కె.సరస్వతి విద్యార్థి, వి.వి.రమణమూర్తి, డి.త్యాగరాజు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, వి.వి.బి. శంకరం పాల్గొని ఐవీఎల్ శాస్త్రి సంగీత సేవలను కొనియాడారు. ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి గౌరవాధ్యక్షులు ఐ.రామచంద్రమూర్తి, అధ్యక్షుడు ఆకొండి వెంకటరావు, కార్యదర్శి పి.జగన్‌మోహన్‌రావు, కోశాధికారి జి.మధుబాబు, సంగీత సంస్థ శిష్య బృందం పాల్గొన్నారు.

దైవానుగ్రహంతోనే రాశులు అనుకూలిస్తాయి



పంచాంగ పఠనం చేస్తున్న వెంకట సూర్యనారాయణమూర్తి

దాబాగార్డెన్స్: పోలీస్ బ్యారెక్స్ ప్రాంగణంలో గల పాపాహోంలో భారత్ వికాస్ పరిషత్ విశాఖ శాఖ అధ్యక్షుడు పి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించి పంచాంగ పఠనం జరిపారు. పాపాహోం అధ్యక్షుడు డి. సూర్యప్రకాశరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం కాకూరి వెంకట సూర్యనారాయణమూర్తి పంచాంగ పఠనం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ దైవానుగ్రహంతోనే రాశులు అనుకూలిస్తాయని, ఆ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు.

ప్రగతి పథం

- 16వ వార్డులో రూ. 9.69 కోట్లతో పనులు
- ఇసుకతోటలో పట్టణ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు
- అందుబాటులో పార్కులు, క్రీడా స్థలాలు, ఓపెన్ జిమ్
- కమ్యూనిటీ భవనాల నిర్మాణం
- తారు, సీసీ రోడ్ల నిర్మాణం



ఎన్‌జీజీవో కాలనీలో ఆధునికీకరించిన పార్కు



ఇసుకతోటలో నిర్మించిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం

మద్దిలపాలెం: తూర్పు నియోజకవర్గంలో 2019–24 మధ్య అభివృద్ధి పరుగులు పెట్టింది. అందులోనూ జీవీఎంసీ 16వ వార్డులో రూ.9.96 కోట్లతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించారు. గత టీడీపీ హయాంలో అభివృద్ధి ఎక్కడ వేసి గొంగలి అక్కడే అన్న చందంగా ఉండేది. ఆ తరువాత వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జీవీఎంసీ ఎన్నికలు జరిగాయి. అనంతరం కొలువుదీరిన పాలకవర్గంతో వార్డులో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. 16వలో పార్కులు, రోడ్లు, సీసీ రహదారుల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. గతంలో ఈ వార్డులో ఏ ప్రభుత్వం కూడా ఇన్ని నిధులతో అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలాలు లేవు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ మొల్లి లక్ష్మి ప్రజల మౌలిక సదుపాయాలు కల్పించాలనే ధ్యేయంతోనే అధిక మొత్తంలో నిధుల మంజూరుకు కృషి చేశారు. జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి అందుకు అనుగుణంగానే నిధులు కేటాయించి సహకారం అందించారు.

రూ.1.08 కోట్లతో యూపీహెచ్‌సీ నిర్మాణం

ఇసుకతోటలో వార్డు ప్రజలకు సర్కారు వైద్యం అందుబాటులోకి తీసుకురావడానికి రూ.1.08 కోట్లతో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని(యూపీహెచ్‌సీ) అన్ని సదుపాయాలతో అత్యాధునికంగా నిర్మించారు. ఈ కేంద్రంలో పేదలకు ఉచితంగా 63 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. 10 పడకలు అందుబాటులో ఉన్నాయి. వారంలో ఐదు రోజుల పాటు సూపర్ స్పెషాలిటీ వైద్యులు వచ్చి పరీక్షలు చేస్తున్నారు.

రూ.1.50 కోట్లతో జీవీఎంసీ పాఠశాల అభివృద్ధి

భావనగర్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆధునికీకరణకు రూ.1.50 కోట్లు వెచ్చించారు. దీంతో ఈ స్కూల్ కార్పొరేట్ పాఠశాలకు దీటుగా రూపుదిద్దుకుంది.

రెండు పార్కుల ఆధునికీకరణ

వార్డులో రెండు పార్కులను ఆధునికీకరించారు. ఆహ్లాదం కోసం ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించారు. ఎన్‌జీజీవో కాలనీతో పాటు విద్యానగర్‌లో పార్కులను అన్ని హంగులతో అద్భుతంగా తీర్చిదిద్దారు. సిమెంట్ బెంచీలు, వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టారు. ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు.



రజకవీధిలో నిర్మించిన కమ్యూనిటీ భవనం

రూ.1.65 కోట్లతో తారురోడ్ల నిర్మాణం

.వార్డులో 8 చోట్ల రూ.1.65 కోట్లతో తారురోడ్లు వేశారు. గోతులతో, అస్తవ్యస్తంగా రాకపోకలు వీలు లేనంతా ఉండే రోడ్లకు మహర్దశను తీసుకొచ్చారు. భానునగర్, రజకవీధి, అంబేడ్కర్ కాలనీ, కేఆర్ఎం కాలనీ తదితర ప్రాంతాల రహదారులను అభివృద్ధి చేశారు. రూ.99 లక్షలతో 8 సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో కొత్త రోడ్లతో వార్డులోని కాలనీలు కళకళలాడుతున్నాయి.



అభివృద్ధి చేసిన కేఆర్ఎం కాలనీలో పార్కు

కాలువల ఆధునికీకరణకు రూ.3.25 కోట్లు

వార్డులో ప్రధాన కాలువలు, కాలనీలో వీధి కాలువల ఆధునికీకరణ పూర్తి చేశారు. ఇందుకు రూ.3.25 కోట్లు వెచ్చించారు. వర్షా కాలంలో మురుగునీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా కాలువలను తీర్చిదిద్దారు. వీటితో పాటు వార్డులో రెండు శ్మశానవాటికలను రూ.28 లక్షలతో అభివృద్ధి చేశారు. మరో రూ.1.44 కోట్లతో గెడ్డలకు రక్షణ గోడలు నిర్మించారు.

వార్డులో అభివృద్ధి అద్భుతం



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వార్డులో అభివృద్ధి అద్భుతం జరిగింది. కొత్త రోడ్లతో ప్రయాణం సాఫీగా సాగుతోంది. కాలువలో మురుగునీటి దుర్వాసన లేకుండా చేశారు. సీసీ రోడ్లు వేశారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి చేశారు.

–దమరసింగి వెంకటరమణ, రజకవీధి

అందుబాటులో ఉచిత వైద్యం



ఇసుకతోటలో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించి ఉచిత ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా కేజీహెచ్ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు కూతవేటు దూరంలో ప్రభుత్వ ఆస్పత్రి ఉంది. దీంతో గర్భిణులు, బీపీ, షుగర్‌తో బాధపడుతున్న వారికి వైద్యంతో పాటు, మందులు అందుతున్నాయి.

– కురిమిని లక్ష్మి, కేఆర్ఎం కాలనీ

మౌలిక వసతులకు ప్రాధాన్యమిచ్చాం..



16వ వార్డులో రూ.9.96 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలకు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన మహర్దశ పట్టింది. ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధ్యానత ఇచ్చాం. యూపీహెచ్‌సీ, పార్కుల ఆధునికీకరణ చేపట్టాం. ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాం. వర్షానికి ముంపునకు గురయ్యే ప్రాంతాలలో కాలువలను ఆధునికీకరించి సమస్యను పరిష్కరించాం.

– మొల్లి లక్ష్మి, 16వ వార్డు కార్పొరేటర్

చంద్రబాబు అధికారంలోకి వస్తే పథకాలు రద్దు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ
- 9వ వార్డులో 'మేము సిద్ధం–మా బూత్ సిద్ధం'



9వ వార్డు సిద్ధం సభలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: రానున్న ఎన్నికల్లో చంద్రబాబు పొరపాటున అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఇంత వరకు పక్కాగా అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆపేస్తారని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఆరోపించారు. జీవీఎంసీ 9వ వార్డు సంజయ్‌గాంధీ కాలనీలో 'మేము సిద్ధం–మా బూత్ సిద్ధం'సభ వార్డు కార్పొరేటర్ స్వాతి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు, జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించి ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలన్నారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయితే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. లేదంటే టీడీపీ ఆ పథకాలను ఆపేసి ప్రజలను ఇబ్బందిపెడుతుందని హెచ్చరించారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ ముఖ్యమంత్రి జగన్ సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. 9వ వార్డులో గడిచిన ఐదేళ్లలో కొన్ని రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న వలంటీర్లను రాజకీయ కుతంత్రంతో చంద్రబాబు తప్పించారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చే వలంటీర్లను ఇప్పుడు రాకుండా చేశారన్నారు. దీంతో అవ్వాతాతలు, దివ్యాంగులు సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోవడానికి నానా ఇబ్బందులు పడ్డారన్నారు. అటువంటి పరిస్థితిని మళ్లీ తెచ్చుకోకుండా అప్రమత్తమై వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పి.వి.నారాయణ, ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సిద్ధం సభలో పాల్గొన్న ప్రజలు

ఘనంగా నూకాంబిక జాతర



ఆరిలోవ కాలనీ నూకాంబిక అమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ వద్ద నూకాంబిక అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. ఆరిలోవ కాలనీ, ఆపరేషన్ కాలనీ, కనకమహాలక్ష్మినగర్, పాండురంగాపురం ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. చీరలు, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, తదితర పార్టీ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో ఎంవీవీ పాల్గొని భక్తులకు ప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సీతారాముల కల్యాణం రాట



ఉడుపురాట వేస్తున్న గ్రామస్తులు

మద్దిలపాలెం: పాత వెంకోజీపాలెంలో శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ నవమి ఉత్సవాలకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సీతారాముల కల్యాణం రాటను ఆలయ ప్రాంగణంలో వేద మంత్రోచ్చారణల నడుమ భక్తిశ్రద్ధలతో వేశారు. ఆదారి పరదేశి, రంపా రామ్మోహనశర్మ దంపతులు ఉడుపురాటకు ప్రత్యేక పూజలు చేశారు. చేతికి కంకణాలు కట్టుకున్నారు. హనుమత్ సీతారామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలతో పాటు ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన సాయి ఉత్సవ విగ్రహానికి మంగళస్నానాలు చేశారు. పాలు, పంచామృతాలతో అభిషేకం చేశారు. 9 రోజుల పాటు ఉత్సవ విగ్రహాలకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేయనున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఈ నెల 17న శ్రీరామ నవమిని వైభవంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు పీలా వెంకట పరదేశినాయుడు, కార్యవర్గ సభ్యులు కర్రి శ్రీను, యల్లపు నాగారాజు, మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు ఉగాది శోభ



ఆదర్శనగర్ షిర్డీ సాయిబాబా ఆలయం ఆవరణలో సామూహిక పూజలు



సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎంవీవీ



పీతలవానిపాలెం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

ఆరిలోవ: తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా మంగళవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో మంగళవారం ఉగాది పూజలు నిర్వహించారు. చినగదిలి, పెదగదిలి ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేశారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ.. బాబాను దర్శించుకున్నారు. ఆలయ చీఫ్ ట్రస్టీ వానపల్లి అప్పారావు, సభ్యులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఎంపీని ఆలయ నిర్వాహకులు సత్కరించారు.

షిర్డీ సాయిబాబా ఆలయంలో..

జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో మంగళవారం ఉగాది సంబరాలు ఘనంగా జరిగాయి. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వాహకులు హోమం, సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆదర్శనగర్, రవీంద్రనగర్, డెయిరీ ఫారం ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సాయినాథుడిని దర్శించుకున్నారు. అనంతరం ఉగాది సంబరాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. సాయంత్రం పరసతో పాటు స్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. దీంతో పాటు తెలుగు కొత్త సంవత్సరం ప్రారంభం కావడంతో ఆరిలోవ ప్రాంతంలో ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. రామాలయాలు, షిర్డీ సాయిబాబా మందిరాలు, అమ్మవారు గుడులు, ఆంజనేయస్వామి ఆలయాలు, శివాలయాలకు వెళ్లి భక్తులు పూజలు, అభిషేకాలు చేశారు.

కిటకిటలాడిన ఆలయాలు

మద్దిలపాలెం: శివాజీపాలెంలోని షిర్డీసాయి మందిరంతో పాటు, వర సిద్ధి వినాయక ఆలయానికి భక్తులు పోటెత్తారు. పీతలవానిపాలెంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, పిఠాపురం కాలనీలోని షిర్డీసాయి మందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

14 నుంచి పోలమాంబ ఆలయ వార్షికోత్సవం

బీచ్ రోడ్డు: పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 14 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు నెల రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.గాయత్రి తెలిపారు. ఉత్సవాల నిర్వహణపై మంగళవారం సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 14న చాటింపు, 15న పందిరి రాట వేస్తామని చెప్పారు. సోమవారం పుట్టబంగారం అమ్మవారి దేవర పండగను ఘనంగా నిర్వహిస్తామన్నారు. 22న తొలేళ్ల ఉత్సవం, 23న అనుపు ఉత్సవం జరుగుతుందన్నారు. 30న మంగళవారం మారువారం పండగను నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 4న మహా అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష పాల్గొన్నారు.

వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి

మహారాణిపేట: నాలుగున్నరేళ్లుగా వలంటీర్లను నోటికొచ్చినట్లు మాట్లాడిన చంద్రబాబు రూ. 5 వేల గౌరవ వేతనాన్ని రూ. 10 వేలకు పెంచుతానని బూటకపు ప్రకటనలు చేస్తే నమ్మడానికి వలంటీర్లు సిద్ధంగా లేరని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు అన్నారు. వలంటీర్ల ద్వారా జరుగుతున్న పెన్షన్ పంపిణీని చంద్రబాబు అడ్డుకోవడం వల్ల ఆ పార్టీపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయన్నారు. వలంటీర్ వ్యవస్థను వ్యతిరేకిస్తే నామరూపాలు లేకుండా పోతామని అర్థమై యూటర్న్ తీసుకున్నారని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. వలంటీర్ల ఆత్మగౌరవం దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు



గాయపడిన భారతి

ఎంవీపీ కాలనీ: వెంకోజీపాలెం కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చినగదిలి సంజయ్‌గాంధీ కాలనీకి చెందిన మామిడి భారతి(26) మంగళవారం సాయంత్రం హనుమంతవాక వైపు నుంచి వెంకోజీపాలెం వైపు ద్విచక్ర వాహనంపై వస్తోంది. ఈ క్రమంలో వెంకోజీపాలెం కూడలి వద్ద భారతి ఎంవీపీ కాలనీ వైపునకు మలుపు తిరుగుతుండగా బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి వేగంగా పక్క నుంచి దూసుకెళ్లిపోయాడు. దీంతో అదుపు తప్పిన భారతి వాహనంతో వెనక వస్తున్న ఒడిశా ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడిపోయింది. దీంతో బస్సు ముందు చక్రాలు ఆమె కాలుపైకి ఎక్కేయడంతో కాలు నుజ్జయింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు హుటాహుటిన ఆమెను చికిత్స నిమిత్తం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. ఎంవీపీ పోలీసులు బస్సు డ్రైవర్, కండక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్షేమాభివృద్ధికి పట్టం కట్టండి



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంవీవీ సత్యనారాయణ

బీచ్ రోడ్డు: సంక్షేమాభివృద్ధికి మరోసారి పట్టం కట్టాలంటూ వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఓటర్లను కోరారు. మంగళవారం జీవీఎంసీ 20వ వార్డులో ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. గడిచిన ఐదేళ్లలో వార్డు అభివృద్ధికి రూ.కోట్ల నిధులు ఖర్చు చేశామన్నారు. తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి అత్యధిక మెజార్టీ వచ్చేలా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ముర్వల లక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు ముర్వల సురేష్, నాయకులు శేఖర్, సీతారాం, సునీల్, కాగితాల శేషు, పద్మజ, భాగ్యలక్ష్మి, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాభరణ అలంకరణలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమ్మవారు స్వర్ణాభరణాలు, పట్టుచీరలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా గణపతి పూజ, మండపారాధన నిర్వహించిన అనంతరం ఎస్‌వీఎస్ఆర్‌కే ప్రసాద్ పంచాంగం చదివి వినిపించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి, పంచాంగ పుస్తకాలు వితరణ చేశారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన సిరులతల్లి

నవ్వులు కురిపించిన 'చల్ చల్ గుర్రం'



మాట్లాడుతున్న సినీ నటుడు ఎస్.కె.మిశ్రో

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీనగర్ వాకర్స్ పార్కు ఆవరణలో మంగళవారం సాయంత్రం ఉగాది వేడుకలు సాంప్రదాయ సిద్ధంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. సునరావు చంద్రశేఖ శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం విశాఖ సాయి స్నేహ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రంగస్థల, సినీ నటుడు ఎస్.కె.మిశ్రో, మిశ్రో ప్రియశిష్యుడు ప్రముఖ రంగస్థల, సినీ నటుడు మాచిరాజు నారాయణరావును వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి చేతుల మీదుగా సత్కరించారు. మాచిరాజు నారాయణరావు సమర్పణలో ప్రముఖ నటులు ఎస్.వి.ఎల్.ఎన్ ప్రసాద్ 'మిమిక్రీ', ఆకట్టుకుంది. ఎస్.వి.ఎల్.ఎన్ ప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శించిన ప్రముఖ రచయిత, ప్రఖ్యాత సినీ నటుడు తనికెళ్ల భరణి రచించిన చల్‌చల్ గుర్రం హాస్య నాటిక నవ్వులు కురిపించింది. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి ఆర్.సత్యనాథం, 101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, పూర్వ అధ్యక్షులు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.